క్లుప్తంగా

పరవాడ తహసీల్దారుగా కనకారావు

పరవాడ: పరవాడ తహసీల్దారుగా పి.కనకారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో నాతవరం మండల తహసీల్దారుగా పనిచేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో పరవాడ తహసీల్దారుగా పనిచేసిన వి.ప్రకాశరావు మునకపాక తహసీల్దారుగా బదిలీ అయ్యారు. తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన కనకారావుకు రెవెన్యూ కార్యాలయ డీటీ శాంతిభూషణ్, ఆర్‌ఐ శ్రీలేఖ, సీనియర్ అసిస్టెంటు, వీఆర్వోలు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే రూ. 10 వేల జరిమానా

పరవాడ: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్‌తనిఖీల్లో పట్టుబడిన వారికి ఇకపై రూ.10 వేల జరిమానా లేదా వారం రోజులు జైలుశిక్ష విధించబడుతుందని పరవాడ సీఐ పి.ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అనకాపల్లి రెండవ తరగతి మెజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీ చేశారని, సదరు విషయాన్ని వాహన చోదకులంతా గమనించాలని సీఐ ఈశ్వరరావు సూచించారు.

డీటీగా బాధ్యతలు స్వీకరించిన శాంతిభూషణ్

పరవాడ: పరవాడ డిప్యూటీ తహసీల్దారుగా డి.శాంతిభూషణ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన యలమంచిలి ల్యాండ్ ఎక్విజిషన్ డీటీగా విధులు నిర్వహించి పరవాడ డీటీగా బదిలీపై వచ్చారు. ఈయనకు గతంలో పరవాడ ఆర్‌ఐగా పనిచేసిన అనుభవం ఉంది. ఇక్కడ గతంలో డీటీగా పనిచేసిన వరహాలు రోలుగుంట మండల డీటీగా బదిలీ అయ్యారు.

అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం



దాత రాజుకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

పరవాడ: నాయుడుపాలెం దరి హనుమాన్‌నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి లంకెలపాలెం పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు రూ.10116 విరాళంగా ఆలయ నిర్వాహకులకు శుక్రవారం అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు ఆలయ ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికను బురదరాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కూండ్రపు సీతారామయ్య, ఈ.లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ దేవాలయ వార్షికోత్సవం



శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న రెడ్డి నారాయణరావు తదితరులు

సింహాచలం : రాంపురంలో ఉన్న శ్రీకృష్ణ దేవాలయం 9వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. భక్తులు విశేషంగా తరలి వచ్చి శ్రీకృష్ణుని దర్శించుకున్నారు. మాజీ జెడ్పీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు తదితరులు పాల్గొని స్వామికి పూజలు చేశారు.

అప్పన్న సన్నిధిలో అక్షయపాత్ర చైర్మన్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న మధు పండిత దాస

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం అక్షయపాత్ర సంస్థ చైర్మన్ పద్మశ్రీ శ్రీమాన్ మధుపండిత దాస దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని సూపరింటెండెంట్ నరసింగరావు అందజేశారు. హరేకృష్ణ మూమెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస తదితరులు ఆయన వెంట ఉన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- గడప గడపలో సమస్యలపై ఆరా



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం : ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించే ధ్యేయంతోను గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. జీవీఎంసీ 97వ వార్డు 508 సచివాలయ పరిధిలోని శ్రమశక్తినగర్, సత్యనగర్, సాయినగర్‌లో శుక్రవారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే అవి ఏ విధంగా అందించాలో వలెంటీర్లు, సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో 97వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్, నాయకులు రాపర్తి వాసు, ముమ్మన సన్యాసిరావు, సందీప్, అప్పల నాజు, వేణు, జీవీఎంసీ ఏఈ రాజశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఏపీఈపీడీసీఎల్ లైన్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్మాణాల పరిశీలన



పైడివాడ అగ్రహారంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కిరణ్‌కుమారి

సబ్బవరం: హౌసింగ్‌డేలో భాగంగా మండలంలోని పలు లేఔట్లు, ప్రభుత్వ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలను మండల ప్రత్యేక అధికారి కిరణ్‌కుమారి శుక్రవారం పరిశీలించారు.పైడివాడ అగ్రహారం లేఔట్‌ను సందర్శించి గృహ నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. అదే విధంగా నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని, అమృతపురంలో నాడు-నేడులో భాగంగా చేపట్టిన పాఠశాల ఆధునికీకరణ పనులను పరిశీలించారు. బాటజంగాలపాలెంలోని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ పథకంలో భాగంగా చేపట్టిన అమృత సరోవర్ ప్రాజెక్టు పనులను ఆమె పరిశీలించారు. అదే విధంగా సబ్బవరం పీహెచ్‌సీని సందర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో ఎస్. బాబురావు, మండల విద్యాశాఖాధికారి ఎస్. అప్పలరాజు, హౌసింగ్ ఏఈ శేఖర్, సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి చక్రవర్తి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో ఎం. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తాటిపూడి పైప్‌లైన్ లీకేజీ



కరాసాలో పైప్‌లైన్ లీకై ప్రవహిస్తున్న తాగునీరు

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు కరాసా వద్ద బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డులో కొన్నాళ్లుగా తాటిపూడి పైప్‌లైన్ లీకవుతోంది. దీంతో తాగునీరు అధికంగా రోడ్డెక్కి ప్రవహిస్తోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు ఇక్కడి పరిస్థితిని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. నీరు రోడ్డుపైకి రాకుండా చిన్న కాలువల్లా తవ్వేసి చేతులు దులిపేసుకున్నారని విమర్శిస్తున్నారు. గతంలో కూడా ఇక్కడ భారీగా లీకులు ఏర్పడ్డాయి. కొన్ని నెలలుగా మరమ్మతులు చేపట్టారు. ఆ తరువాత మళ్లీ అదే ప్రాంతంలో లీకులు వస్తున్నాయి.

రైతు భరోసా కేంద్రాల సేవలు సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి శ్రీనివాస్

పరవాడ: ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న వరి విత్తనాలను సద్వినియోగం చేసుకోవడానికి రైతులు ముందుకు రావాలని పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ శాఖ ద్వారా నాణ్యమైన విత్తనాలను వాడి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను స్థానిక ఆర్‌బీకే కేంద్రాల్లో ప్రభుత్వం అందుబాటులో ఉంచిందని వాటిని వినియోగించుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి సీహెచ్ చంద్రావతి మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు రైతులకు అవసరమైన బీపీటీ 5204 (సాంబామసూరి) రకం వరి విత్తనాలు 80 క్వింటాళ్లు, ఆర్‌జీఎల్ 2537 రకం శ్రీకాకుళం సన్నాలు 80 క్వింటాళ్లు, ఎంటీయూ 1224 మార్టేరు సాంబా రకం 5 క్వింటాళ్లు, ఆర్ఎన్ఆర్ 15048 తెలంగాణ సోనా రకం వరి విత్తనాలు 2 క్వింటాళ్లు ఆర్‌బీకేల్లో సిద్ధంగా ఉన్నాయన్నారు. వరి విత్తనాలకు కిలోకు రూ.10 రాయితీ లభిస్తుందని చెప్పారు. వరి విత్తనాలు కావలసిన రైతులు గ్రామ సచివాలయ సహాయకుల ద్వారా తమ పేర్లు నమోదు చేసుకుని విత్తనాలు పొందవచ్చన్నారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కోన రామారావు, వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నెల సన్యాసిరావు, పార్టీ నాయకులు బండారు రాజశేఖర్, మండల ఏఈవో ఎంఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్య కల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



సబ్బవరం లా యూనివర్సిటీ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ రంగనాథం, సిబ్బంది



ప్రమాదాల గురించి తెలియజేస్తున్న ఎస్ఐ రమేష్

సబ్బవరం: మండలంలోని పలు చోట్ల సీఐ రంగనాథం ఆధ్వర్యంలో శుక్రవారం విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని పలు ద్విచక్ర వాహనాలపై కేసులు నమోదు చేశారు. మందు బాబులు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.హెల్మెట్ ధారణతో పాటు రోడ్డు ప్రమాదాలపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో కోడి పందాలు, గుళ్లాటలు, పేకాట, మద్యం, గంజాయి అక్రమ రవాణాపై ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళలకు దిశ యాప్, ఫోక్సో చట్టం, యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐలు అల్లు వెంకటేశ్వరరావు, ఎల్. సురేష్, సిబ్బంది సాయి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలి

సింహాచలం : ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితమైన ప్రయాణాన్ని సాగించాలని పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ తెలిపారు. సుప్ర వెహికల్ ద్వారా శుక్రవారం పెందుర్తి, చినముషిడివాడ, వేపగుంట, పురుషోత్తపురం కూడళ్లలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం ద్వారా చోటు చేసుకునే రోడ్డు ప్రమాదాల గురించి స్క్రీన్‌లో చూపించారు. ద్విచక్ర వాహనదారులంతా హెల్మెట్ ధరించాలని సూచించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమని, సిగ్నల్ జంప్ చేయడం తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని వివరించారు.

గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలు



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సింహాచలం : అడవివరం గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. తమదైన శైలిలో పలు చిత్రాలు గీశారు. ఎస్ఆర్ పురంలోని ప్రియదర్శిని బధిరుల పాఠశాల ఉపాధ్యాయిని వాసవి ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ రీడర్స్ ఫోరం కమిటీ అధ్యక్షుడు బి.బి.రాజేంద్రప్రసాద్, గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం, ఉద్యోగిని ఎల్లమ్మ, పాఠకులు వర, పుష్ప, రమేష్, బి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషతో పాటు ఇంగ్లిష్ కూడా అవసరం



మాట్లాడుతున్న రచయిత జీవన్‌కుమార్

సీతంపేట: మాతృ భాషతోపాటు ఆంగ్ల భాష అవసరం ఎంతో ఉందని, అమెరికన్ ఇంగ్లిష్ భవిష్యత్ దోహదకారని లెగ్జిగ్రాఫర్ వీఎస్టీ తెలుగు-ఇంగ్లిష్ డిక్షనరీ రచయిత ససపల జీవన్‌కుమార్ అన్నారు. తన్మయి క్రియేటివ్స్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అమెరికన్ ఇంగ్లిష్ శైలిపై రెండు రోజుల ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికన్ ఇంగ్లిష్ శైలి, గురి, వినియోగం, ఆంగ్లం-అమెరికన్ ఇంగ్లిష్‌కు సంబంధించి కొన్ని పదాలు పలికి సంభాషించడం, వాక్య నిర్మాణాలు సోదాహరణంగా వివరించారు. సనాతన ధర్మం, మొండి ఘటం, పెళ్లి చూపులు, కొబ్బరి బొండాం వంటి రోజువారి పదాలను ఆంగ్ల వెర్షన్, కోమాలిమ్ వంటి ఆంగ్ల పదాల రీతులను ప్రస్తావించారు. కార్యక్రమంలో తన్మయి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బి.ఎస్.చంద్రశేఖర్, కార్యదర్శి సిహెచ్.వి.సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్టు నాగనబోయిన నాగేశ్వరరావు, కొణతాల రాజు, బాండంగీర్ సాయి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం



యోగాపై అవగాహన కల్పిస్తున్న భాగ్యశ్రీ

మురళీనగర్: ప్రతి రోజు కొంత సేపు యోగ సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సచివాలయ మహిళా పోలీస్ ఎం.భాగ్యశ్రీ అన్నారు. మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం యోగా వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేకువజామున లేచి యోగా చేస్తే రోజంతా చురుగ్గా పని చేయగలుగుతారని, ఒత్తిడి నుంచి బయటపడవచ్చని చెప్పారు. ప్రతి రోజూ తగినంత నీరు తీసుకుంటే సగం వ్యాధుల నుంచి దూరంగా ఉండొచ్చని సూచించారు. ప్రోటీన్లు ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. ఖాళీ సమయాల్లో టీవీ, మొబైల్ ఫోన్ చూడటం బదులు పుస్తకాలు చదవాలన్నారు. కార్యక్రమాన్ని లైబ్రేరియన్ వై.పద్మజ పర్యవేక్షించారు.

అలరించిన సంగీత విభావరి

సీతంపేట: సత్య సుమధుర స్వరాలు సంగీత సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పౌర గ్రంథాలయంలో తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి నిర్వహించారు. ప్రముఖ గాయకుడు పి.బి.ఖాన్ నిర్వహణలో గాయనీ గాయకులు హుషారైన సినిమా పాటలు పాడి ప్రేక్షకులను అలరించారు. సన్‌మూర్తి, మహమ్మద్ ఖాన్, రాజేంద్రప్రసాద్, చెక్కా రమాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాయనీ గాయకులు పమ్మరాజు నరసింహమూర్తి, సాంబశివరావు, మెలోడి సత్యనారాయణ, పి.బి.ఖాన్, భాగ్యలక్ష్మి, రాజేశ్వరి తమ గీతాలతో అలరించారు.